ఫ్లెక్సీల వివాదం

ఉప ముఖ్యమంత్రి కటౌట్ తొలగించిన వైకాపా శ్రేణులు


పడిపోతున్న పవన్ కల్యాణ్ కటౌట్

నెల్లూరు(బీవీనగర్), న్యూస్‌టుడే: నెల్లూరు నగరంలో మళ్లీ ఫ్లెక్సీల వివాదం మొదలైంది. మెడికవర్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారి పక్కన స్థానిక డివిజన్ నాయకుడు శ్రీకాంత్.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వాగత కటౌట్ ఏర్పాటు చేశారు. నెల్లూరుగ్రామీణ నియోజకవర్గ వైకాపా సమావేశం జరుగుతున్న నేపథ్యంలో పవన్‌కల్యాణ్ కటౌట్ తొలగించి వైకాపా నేతల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని జనసేన నాయకులు ఆరోపించారు. జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని వైకాపా ఫ్లెక్సీలు తొలగించారు. ఈ సందర్భంగా వైకాపా, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, అజయ్ బాబు, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

జనని.. లోకపావని


నెల్లూరు రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం



అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు.. ఆలయంలో కుంభహారతి.. అష్టలక్ష్మి ఆలయంలో మీనాక్షిదేవిగా..


మధుకైటభవధ అలంకారంలో జొన్నవాడ కామాక్షితాయి



ఆలయంలో నృత్య ప్రదర్శన.. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకారం

దేవీ నవరాత్రులు సందర్భంగా ఆదివారం వివిధ అలంకరణల్లో ఉన్న అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అన్నపూర్ణ, రాజరాజేశ్వరి, మీనాక్షి, భవానీ, గజలక్ష్మిగా భక్తుల పూజలు అందుకున్నారు. ఆలయాల్లో నృత్యం, భక్తి గీతాలాపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. – ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం), బుచ్చిరెడ్డిపాళెం

ఏడు పదుల వయసు.. క్రీడా యశస్సు

వెటరన్ క్రీడాకారిణిగా రాణిస్తున్న డాక్టర్ లక్ష్మీ సుహాసిని

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)



ఉద్యోగ విరమణ తరువాత ఇంటికే పరిమితమవుతున్న నేటి రోజుల్లో ఓ మహిళ కవయిత్రిగా, విమర్శకురాలిగా, పరిశోధకురాలిగా, వెటరన్ క్రీడాకారిణిగా ప్రశంసలు అందుకుంటున్నారు.

నెల్లూరుకు చెందిన డాక్టర్ లక్ష్మీ సుహాసిని గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో 1982 నుంచి 2012 వరకు అధ్యాపకురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. అధ్యాపకురాలిగా పనిచేస్తూ విద్యార్థినులతో ఉత్సాహంగా త్రోబాల్ ఆడించిన అనుభవంతో ఆమె జావెలిన్ సుహాసినిగా మారారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నారు. 65 ఏళ్లపైబడిన వయసులో రెండు మోకాళ్లకు శస్త్రచికిత్సలు చేయించుకుని నిరుత్సాహ పడకుండా ఫిలిప్పీన్స్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది స్వీడన్‌లో జరిగిన పారా ఒలింపిక్స్‌లో మాస్టర్ అథ్లెట్స్ తరఫున పాల్గొని ప్రత్యేకతను చాటుకున్నారు. డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో, 5కే వాక్, రిలే రన్, హేమర్‌త్రో విభాగాల్లో పాల్గొన్నారు. వీటిలో హేమర్‌త్రో విభాగంలో కాంస్య పతకం అందుకున్నారు.

సాహిత్యరంగంలో..

ఉద్యోగం చేస్తున్న సమయంలోనే డాక్టర్ కేవీ రమణా రెడ్డి సాహిత్యంపై పరిశోధన చేసి 'సాహిత్యంలో అరుణ తార కేవీఆర్' అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి పీహెచ్‌డీ అందుకున్నారు. విశ్రాంత ఉద్యోగినిగా 2015లో 'జానపద పాటలలో స్త్రీల వ్యక్తీకరణ రీతులు' అనే అంశంపై మద్రాస్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనకు డీలిట్ పట్టా అందుకున్నారు. సాహిత్యరంగంలో జానపద పాటల సేకరణ చేస్తూ జానపద పాటల్లో స్త్రీలలో దళితుల అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేసే గీతాలను రచించారు. అందులో భాగంగా 'దామదాచాయ', 'రెక్కలు పొదిగిన చూపు' రచించారు.

పర్యావరణ హితానికి..

కళాశాల అధ్యాపకురాలిగా పనిచేసే నాటినుంచి పర్యావరణ హితం కోసం ఎన్నో చిత్రాలు వేశారు. 120కి పైగా సాహిత్య సదస్సులు నిర్వహించారు. కలోజ్ చిత్రాలు రూపొందించడంలో ప్రత్యేకత చాటుకున్నారు. సాధించిన 54 అంతర్జాతీయ రికార్డులను గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ప్రత్యేకంగా ప్రదర్శనకు సుహాసిని అచీవ్‌మెంట్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రస్థానంలో ఆమె మొల్ల సాహిత్య, దువ్వూరు రామిరెడ్డి పురస్కారాలు, ఆలిండియా రచయితల సంఘం నుంచి జాతీయ అవార్డు అందుకున్నారు. విద్య పరిశోధన రంగాల్లో కృషికి గ్లోబల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అసోసియేషన్ బంగారు పతకాన్ని అందించింది.

ఇంటికే పరిమితం కావొద్దు

ఉద్యోగ విరమణ తరువాత ఇంటికే పరిమితం కావొద్దు. విశ్రాంత జీవితంలో సైతం ప్రతిభను చాటుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా యువతరం వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో నిరంతరం కృషిచేసి ప్రత్యేకతను చాటుకోవాలి. – డాక్టర్ లక్ష్మీ సుహాసిని

తిప్పలు కొల్లగొట్టిన వారిపై కనికరమా?

గ్రావెల్ అక్రమ రవాణాతో జేబులు నింపుకొన్న వైకాపా నేతలు

విచారణ లేదు.. చర్యలు లేవు


అనంతసాగరం మండలంలోని మంచాలపల్లి తిప్పలో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతం ఇది. పక్కనే ఆత్మకూరు– సోమశిల రోడ్డు ఉంది. అయినా వైకాపా పాలనలో యథేచ్ఛగా తవ్వి అక్రమ రవాణా చేస్తున్నా నాటి అధికారులు కన్నెత్తి చూడలేదు.

- ఆత్మకూరు పరిధిలోని నెల్లూరుపాలెం తిప్ప నెల్లూరుపాలెం– బోయిళ్ల చిరువెల్ల మధ్యలో విస్తరించి ఉంది. అనుమతులు లేకుండానే పది ప్రాంతాల్లో గ్రావెల్, క్వార్ట్జ్ లక్ష క్యూబిక్ మీటర్ల వరకు తవ్వారు. అక్రమ తవ్వకాలపై గత ప్రభుత్వ కాలంలో గనులశాఖ పరిశీలన లేకపోగా.. చర్యలూ లేవు.
- చేజర్ల మండలంలోని మాముడూరు తిప్పపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేశారు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.


ఈ చిత్రంలో తవ్వకాలు జరిగిన ప్రాంతం సంగం మండలంలోని పెరమన తిప్ప. ఇక్కడ 7,820 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలకు తాత్కాలిక అనుమతి తీసుకొని 70వేలు క్యూబిక్ మీటర్ల పైనే తవ్వారు. గ్రామస్థుల ఫిర్యాదుతో గనుల శాఖ అధికారులు తనిఖీలు చేసి రూ. 40,80,770 జరిమానా విధించారు. వసూళ్లలో కదలిక లేదు.

న్యూస్‌టుడే, ఆత్మకూరు

ఆత్మకూరు నియోజకవర్గంలో వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు తిప్పలు కొల్లగొట్టి.. గ్రావెల్, మట్టిని వెంచర్లకు అమ్ముకుని రూ.కోట్లు వెనకేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇసుక, క్వార్ట్జ్ తవ్వకాలలో అక్రమాలను వెలికి తీస్తోంది. ఇప్పటికే కొన్నిచోట్ల లెక్క తేల్చింది. తిప్పల్లో అక్రమ తవ్వకాలపై ఇప్పటి వరకు దృష్టి సారించలేదు. ఆ దిశగా పరిశీలన చేస్తే జిల్లాలో వందల కోట్ల రూపాయల దోపిడీ వెలుగులోకి వస్తుందని కూటమి పార్టీల నేతలు అంటున్నారు. నాడు అధికారుల కళ్ల ముందే అక్రమాలు చోటు చేసుకున్నాయి. అడ్డుకోవాలనే ఆలోచనే వారికి రాలేదు. నాడు పెరమన, కొరిమెర్ల తిప్ప ప్రాంతాల్లో విధిలేక తనిఖీలు చేసినా అక్రమార్కుల దోపిడీ పూర్తి స్థాయిలో వెలికి తీసింది లేదు. వేసిన జరిమానాలు రివిజన్‌ల పేరుతో అటకెక్కించారు.

ప్రజాప్రతినిధుల అండ

జిల్లాలో నాటి వైకాపా ప్రభుత్వం అండతో గ్రావెల్ మాఫియా ప్రధానంగా కావలి, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలపై దృష్టి నిలిపింది. పుష్కలంగా గ్రావెల్ నిల్వలు ఉండటమే అందుకు కారణం. అక్రమార్కులకు ఆయా నియోజకవర్గాల ప్రజా ప్రతినిధుల అండదండలు ఉండటంతో అక్రమాలకు నాడు అడ్డూ అదుపులేకుండా పోయింది.

ముఖ్య నాయకులే మాఫియాగా మారి..

సంగం మండలంలో వైకాపా ముఖ్య నాయకులే మాఫియాగా మారి నాడు అక్రమ తవ్వకాలు చేశారు. సంగం తిరమన తిప్ప, కొండ, పెరమన తిప్ప, కొరిమెర్ల తిప్పల్లో వారి ఇష్టం వచ్చినట్లు తవ్వి అక్రమ రవాణా చేశారు. తవ్వకాలపై గత మేలో గ్రామస్థుడు ఫిర్యాదు చేశారు. పెరమన, సంగంకొండ, కొరిమెర్ల తిప్పల్లో తనిఖీ చేసి జరిమానా విధించారు. నాడు వైకాపా ప్రభుత్వంలో రివిజన్ పిటీషన్ వేశారని ఈ విషయం పట్టించుకోలేదు. ఇప్పటివరకు ఈ ప్రాంతాల్లో ఏమేర అక్రమ తవ్వకాలు చేశారనే విషయంలో పరిశీలనే లేదు. చేజర్ల మండలంలోని మాముడూరు తిప్పల్లో, అనంతసాగరం మండలం మంచాలపల్లి, ముత్తుకూరు, వెంగంపల్లి ప్రాంతాల్లో గ్రావెల్ తవ్వకాలను అసలు పట్టించుకోలేదు. అనుమసముద్రంపేట మండలం సీబీవరం, రాజోలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి.


వివరాలు చెప్పలేను

జిల్లాలో తిప్పలను కొల్లగొట్టిన తీరు నిగ్గు తేల్చే విషయమై గనులు భూగర్భవనరులశాఖ ఏడీ శ్రీనివాసరావును వివరణ కోరగా తాను బదిలీ అయినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు ఇప్పుడు చెప్పలేమన్నారు.

దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతులు

పొదలకూరు, న్యూస్‌టుడే: మెట్టప్రాంతంలో నిమ్మ దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో రాష్ట్రంలోని ఏలూరు, తెనాలి మార్కెట్లు దెబ్బతిన్నాయి. అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొదలకూరు, గూడూరు మార్కెట్లకు వచ్చే నిమ్మకాయలు దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. నెల రోజుల క్రితం పక్వానికి వచ్చే కాయలను సైతం రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. పొదలకూరు నిమ్మ మార్కెట్లో ఆదివారం బస్తా ధర రూ. 5000 నుంచి రూ. 6500 వరకు పలికింది. దక్షిణాది రాష్ట్రాల్లోని చెన్నై, బెంగళూరులో డిమాండ్ ఉండటంతో ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని బిహార్, రాంచీ, గయా ప్రాంతాలకు తరలించాలని అక్కడి వారు కోరుతున్నా స్థానిక వ్యాపారులు రవాణా ఛార్జీలు భారమవుతాయని చెబుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో విక్రయాలకే మొగ్గు చూపుతున్నారు. గత నాలుగు రోజులుగా నిమ్మధరలు ఊపందుకున్నాయి. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు మచ్చతెగుళ్లతో నాణ్యత కోల్పోతున్నాయి. మార్కెట్‌కు వచ్చిన 35 శాతం కాయలు మచ్చలు, డాగులు ఏర్పడి దూర ప్రాంతాలకు తరలించేందుకు ఉపయోగపడటం లేదని వ్యాపారులు పేర్కొన్నారు.

కొంటే.. కొంప కొల్లేరే!



ధనార్జనే ధ్యేయంగా స్థిరాస్తి వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ.. స్థలాలు కొనుగోలు చేసి స్థిర నివాసం ఏర్పరచుకోవాలని కలలుగనే వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అనధికార లేఅవుట్లు వేసి నమ్మించి అమ్ముతుండటంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోక పోవడంతో వారి అక్రమాలకు అడ్డూఅదుపులేకుండా పోయింది.

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

జిల్లాలో గత అయిదేళ్ల వైకాపా పాలనలో అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలతో వ్యాపారులు వాటిని వేశారు. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు ఎట్టకేలకు చర్యలకు సిద్ధమయ్యారు. జిల్లాలో నుడా పరిధిలోని అక్రమ లేఅవుట్లలో ఇప్పటి వరకు 117 గుర్తించారు. నుడా పరిధిలోని బోగోలు, గుడ్లూరు, ఇందుకూరుపేట, నెల్లూరుగ్రామీణం, జలదంకి, కలిగిరి, కావలి, కోవూరు, మనుబోలు, మర్రిపాడు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో ఇవి ఉన్నాయి. అలాగే నగరపాలకసంస్థ అధికారులు 40 అనధికార లేఅవుట్లు గుర్తించి జాబితాను సిద్ధం చేశారు. నెల్లూరురూరల్ పరిధిలోని అల్లీపురం 24.61, 12.44 ఎకరాలు, గుడిపల్లిపాడులో 15.30, 27.46, 20.00, గుండ్లపాళెంలో 16.30, 13.00, నెలూరు బిట్-2లో 13.00 ఎకరాల్లో భారీ లేఅవుట్లను అక్రమంగా ఏర్పాటు చేశారు. గుడ్లూరు మండలం మోచర్లలో 2023లో 40.2, 18.56, 37.05 ఎకరాల్లో, 2021లో 6.82 ఎకరాల్లో, బోగోలులో 2023లో 33 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. జువ్వలదిన్నెలో 1.57, 2.4, 2.85 ఎకరాల్లో వేసిన లేఅవుట్లకు కూడా అనుమతులు లేవు. అనుమతులు లేకుండా వేసిన స్థిరాస్తి వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆయా స్థలాల్లో ప్లాట్లు కొనుగోలు చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు.

తొందరపడితే నష్టం తప్పదు

అనధికార స్థలాలు కొంటే నష్టపోయే ప్రమాదం ఉంది. లేఅవుట్లకు అనుమతి లేదని అధికారులకు తెలిస్తే రిజిస్ట్రేషన్ శాఖకు తెలిపి క్రయ, విక్రయాలు నిలిపివేస్తారు. ఇలాంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ, మున్సిపాలిటీలు అనుమతులివ్వవు. బ్యాంకు రుణం మంజూరు కావు. నిర్మాణాలు చేపట్టినా కూల్చివేస్తారు. నెల్లూరునగర పరిధిలో ఇటువంటి ఘటనలు అనేకం. అనధికార లేఅవుట్‌లో ప్లాను కోసం దరఖాస్తు చేసుకుంటే ప్లాటు యజమాని ఇంటి నిర్మాణ అనుమతుల రుసుంతో పాటు గతంలో లేఅవుట్ యజమాని చెల్లించాల్సిన ఫీజులు కలిపి రూ.లక్షల్లో చెల్లించాలి. స్థానిక సంస్థలు వేసే ఇంటి పన్ను వందశాతం అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో అనధికారిక లేఅవుట్లు

జాబితా సిద్ధం

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. అక్రమ లేఅవుట్లను గుర్తించి జాబితా సిద్ధం చేశాం. నోటీసులు జారీ చేస్తున్నాం. అనుమతులు లేని వాటిని క్రమబద్ధీకరించుకోవాలని సూచిస్తున్నాం. ప్రజలు అక్రమ లేఅవుట్లలోని స్థలాలు కొనుగోలు చేసి నష్టపోవద్దు. – సూర్యతేజ, కమిషనర్

జిల్లాలో అక్రమ లేఅవుట్లు: దాదాపు 290 | ఇప్పటివరకు గుర్తించింది: 157 | నుడాకు నష్టం: రూ.10 కోట్లు | నగర, పురపాలక సంఘాలకు..: 25 కోట్లు

సోమశిలకు 10,520 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 10,520 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 317.218 అడుగుల నీటిమట్టం నమోదైంది.

ఇక ప్రమాదాలకు చెక్

నాలుగు వరసలుగా నెల్లూరు- ముంబయి జాతీయ రహదారి

నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిని విస్తరించక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏటా వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అనుమతి ఇచ్చి నిధులు మంజూరు చేసింది.


నెల్లూరు- ముంబయి జాతీయ రహదారి

	మృతులు	ప్రమాదాలు
2021	56	141
2022	52	127
2023	34	129
2024 (ఆగస్టు వరకు)	43	134

న్యూస్‌టుడే, సంగం

జిల్లా సరిహద్దు నుంచి నెల్లూరు వరకు నెల్లూరు- ముంబయి జాతీయ రహదారి 110 కి.మీ పొడవున ఉంది. దాని సమీపంలో మర్రిపాడు, ఆత్మకూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు మండలాలకు చెందిన 30 గ్రామాలున్నాయి. 110 కి.మీ.రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) 2024-25 వార్షిక ప్రణాళికలో చేర్చింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 3,723 కోట్లు మంజూరు చేసింది. రహదారిని నాలుగు వరసల రహదారిగా మార్చేందుకు అవసరమైన వాహనసాంద్రతను తెలుసుకునేందుకు 2018లో పరిశీలన చేశారు. ఆ తరువాత విస్మరించారు.

రూ.150 కోట్ల వ్యయంతో..

2015 వరకు రహదారి కేవలం ఏడు మీటర్ల వెడల్పుతో ఉండేది. దాన్ని జిల్లా సరిహద్దు నుంచి పది మీటర్ల వెడల్పుతో ఆత్మకూరు మండలం జాలాయనగరం వరకు 60 కి.మీ మేర తారుతో, అక్కడి నుంచి నెల్లూరు నగరం వరకు 50 కి.మీ పొడవునా రూ. 150 కోట్లతో పీక్యూసీ విధానంతో సిమెంటు రహదారి నిర్మాణం చేశారు. అయినా ప్రమాదాలు ఆగలేదు.

ఇరుకైన వంతెనలు

సంగం సమీపంలో నెల్లూరు ముంబయి జాతీయ రహదారిని బీరాపేరు వాగు దాటుతుంది. దానిపై ఉన్న వంతెన కేవలం ఏడు మీటర్ల వెడల్పుతో ఉండటంతో 2021 డిసెంబరు నెల తొమ్మిదో తేది రాత్రి లారీ ఢీకొని ఆటో వాగులో పడి ఆరుగురు ఆత్మకూరు వాసులు దుర్మరణం చెందారు. ఇలాంటి వంతెనలు ఈ మార్గం వెంబడి పలుచోట్ల ఉన్నాయి.

8.5 మీటర్ల వెడల్పుతో..

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రణాళికకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున దాన్ని 18.5 మీటర్ల వెడల్పుతో నాలుగు వరసలుగా అభివృద్ధి, విభాగినుల ఏర్పాటు, గ్రామాల వద్ద అండర్ పాస్‌లు, రక్షణ చర్యలకు అవసరమైన డీపీఆర్ రూపొందిస్తారు. అందుకు అనుగుణంగా కలెక్టర్ ఆధ్వర్యంలో భూసేకరణ చేయాలి. టెండర్లను ఆహ్వానించి పనులను గుత్తేదారులకు అప్పగిస్తే రహదారి విస్తరిస్తుంది.

100.6 కి.మీ దూరంలో సమస్యలే..

110 కి.మీ. పొడవైన ఈ రహదారిలో నాలుగు వరుసలు నామమాత్రంగా కేవలం 9.4 కి.మీ. మాత్రమే ఉంది. సంగం మండలంలో వెంగారెడ్డిపాలెం నుంచి సిద్ధీపురం ఎస్సీ కాలనీ వరకు 1.2 కి.మీ., బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు నుంచి నెల్లూరు నగరంలో సాలుచింతలు కూడలి వరకు 8.2 కి.మీ ఉంది.. ఇక్కడ మాత్రం 18.5 మీటర్ల వెడల్పుతో మధ్యలో విభాగినితో ఉంది. మిగిలిన 100.6 కి.మీ దూరం ప్రమాదాలకు నిలయంగా ఉంది.

కామాక్షితాయికి బంగారు లక్ష్మీ కాసుల హారం



ఈవోకు హారం అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయికి తిరుపతికి చెందిన సత్యనారాయణ, శోభాలక్ష్మి దంపతులు 52 గ్రాముల 184 మిల్లీ గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారం ఆలయ అధికారులకు అందించారు. ఆదివారం సంప్రదాయబద్ధంగా ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి దాతలకు స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రంగనాథుడిని దర్శించుకున్న ఎస్‌ఈసీ జాయింట్ సెక్రటరీ


రంగనాథుని సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: రంగనాయకులపేటలోని శ్రీరంగనాథస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ ఆదివారం సందర్శించారు. సతీసమేతంగా దేవస్థానానికి విచ్చేసిన ఆయనకు దేవాలయం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్ చైతన్య ఉన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,334
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,672
వెండి గ్రాము :	రూ. 98.20

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	241
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

జాతీయ స్థాయి పురస్కారానికి
అధ్యాపకురాలి ఎంపిక



ఉదయగిరి, న్యూస్‌టుడే : ఉదయగిరి ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న **డాక్టరు కప్పల పుష్పమ్మ** 2024 సంవత్సరానికి అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.నరసింహులు ఆదివారం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని దీనికి ఎంపిక చేస్తారన్నారు. కలాం జయంతి సందర్భంగా ఈనెల 15న గుంటూరులో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు, మిత్రులు, భాషాభిమానులు ఆమెకు అభినందనలు తెలిపారు.

నిధులు వెచ్చించి నిరుపయోగంగా మార్చి

నగర, పురపాలికల్లో చెత్త తరలింపు సమస్య

నగర, పురపాలికల్లో సేకరించిన చెత్త తరలించేందుకు వాహనాల సమస్య వెంటాడుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో కొనుగోలు చేసినవి పని చేయకనే మూలకుచేరాయి. కొన్ని కొంతకాలం చెత్త తరలించి మొరాయించాయి. అయిదేళ్ల కిందట తెదేపా ప్రభుత్వంలో కొనుగోలు చేసిన వాహనాలను వైకాపా ప్రభుత్వం నిరుపయోగంగా మార్చింది. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయింది.

-న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్), కావలి, కందుకూరు పట్టణం, ఆత్మకూరు, అల్లూరు


నెల్లూరు: పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వృథా ఉన్న వాహనాలు

తుప్పు పడుతున్న స్వచ్ఛాంధ్ర వాహనాలు

నెల్లూరు నగరపాలికకు 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర మిషన్ ఆధ్వర్యంలో రూ.50 కోట్ల విలువైన వాహనాలను సమకూర్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని మూలకు చేర్చింది. వంద వాహనాల వరకు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. పలు వాహనాల విడి భాగాలు దొంగలు ఎత్తుకెళ్లారు. స్వచ్ఛాంధ్ర మిషన్ యంత్రాలపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు పురపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



ఒక్కరోజూ వినియోగించలేదు

అల్లూరు నగర పంచాయతీకి ఎన్నికల సమయంలో ప్రభుత్వం సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే రూ.10 లక్షల విలువైన యంత్రాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు. దీని వినియోగించకుండా వదిలేశారు. చెత్తను తరలించే నెట్టుడు బండ్లు 30 వరకు పనికి రాకుండా పోయాయి. కొన్ని మరమ్మతుల కోసం రోడ్ల మీద వదిలేశారు. పంచాయతీ కమిషనర్ ఉమా మహేశ్వరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎందుకు కొనుగోలు చేశారో...

కావలిలో వీధులను శుభ్రం చేసే వాహనం పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా పడిఉంది. దీన్ని గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసిన తరువాత సన్నటి మట్టి, దుమ్ము రోడ్లకు అతుక్కుని ఉంటే ఈ యంత్ర వాహనానికి ఉండే బ్రష్‌ల ద్వారా తొలగించొచ్చు. దీన్ని పురపాలక సంఘానికి తీసుకువచ్చిన కొద్దిరోజులకే మూలకు చేర్చారు. ఇది పనికి రాదని ప్రస్తుత పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ చెబుతున్నారు.



ప్రారంభించకనే మొరాయించాయి

కందుకూరు మున్సిపాలిటీలో నిత్యం సుమారు 25వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తుంటారు. దాన్ని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు గత వైకాపా ప్రభుత్వం మున్సిపాలిటీకి పది ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరు చేసింది. ప్రారంభించే సమయానికే నాలుగు మరమ్మతుల్లో ఉన్నాయి. మిగిలినవి నాలుగు నెలలు పనిచేసి ఆ తరువాత మొరాయించడంతో పంప్‌హౌస్ వద్ద ఉంచారు. ఆటోలకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు.



ఆటోలు శిథిలం

ఆత్మకూరు పురపాలకంలో చెత్త సేకరణకు వినియోగించే నాలుగు ఆటోల్లో రెండు మరమ్మతులకు గురయ్యాయి. బాగు చేసినా ఇబ్బంది పెట్టాయి. దాంతో ఉపయోగించ లేని స్థితికి చేరడంతో పురపాలక ఆవరణలో ఉంచారు.


పంప్‌హౌస్ వద్ద నిరుపయోగంగా ఉన్న చెత్త ఆటోలు


ఎన్నికైన అసోసియేషన్ కార్యవర్గం

ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నెల్లూరులోని ధనలక్ష్మీపురం కల్పనా రెసిడెన్సీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. సుదీర్ఘ చర్చల అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షునిగా కర్నూలు జిల్లాకు చెందిన డబ్ల్యూ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా చేజర్ల సుధాకర్‌రావు(నెల్లూరు), గౌరవ అధ్యక్షునిగా భానుమూర్తి(గుంటూరు), కోశాధికారిగా ఎన్.హరిప్రసాద్(నెల్లూరు), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.జయప్రకాశ్(కడప), రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎస్‌డీ బేగం(విశాఖపట్నం) ఎన్నికయ్యారు.

జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు..

నెల్లూరు(క్రీడా విభాగం): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షులుగా మలిరెడ్డి శ్రీనివాసులు, కార్యదర్శిగా బి.చంద్రశేఖర్, కోశాధికారిగా బి.ఉమాశంకర్ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా ఏపీఎఫ్ఏనుంచి విజయ్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ నుంచి గురుప్రసాద్, శాప్‌నుంచి యతిరాజ్ హాజరయ్యారు.

అలివి వలలతో వేట.. అడ్డుకునేది ఎవరంట..?

ఆత్మకూరు, అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయం నీటి విస్తీర్ణం 48 చ.కిమీ ఉంది. జలాశయంలో చేపలు పట్టుకునేందుకు మత్స్యకారులకు ఏటా లైసెన్సులు ఇస్తారు. సాధారణంగా జలాశయంలో కిలోపైనే చేపలు పడే కన్ను ఉన్న వలలనే వాడాలి. మత్స్యకారుల జీవనభృతి దెబ్బతినకుండా, మత్స్య సంపద అంతరించకుండా ఉండేందుకు జలాశయంలో అలివి వలలతో వేట నిషేధించారు. ఈ రకం వలలను ఉపయోగించి వేటసాగిస్తే.. చిన్న చిన్న చేపపిల్లలు కూడా ఊడ్చినట్లు వచ్చేస్తాయి. దీంతో మత్స్యసంపదకు ప్రమాదం ఉంది. అక్రమ మార్గంలో కొందరు వీటిని తీసుకొచ్చి కూలీలను పెట్టి మరీ వేట సాగిస్తున్నారు. అధికారులకు ముడుపులు అందుతుండడంతో చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సోమశిల జలాశయంలో చేపల అక్రమ వేట మొదలైంది. శనివారం రాత్రి కొందరు వ్యక్తులు 12 అలివి వలల తోటి వేట సాగించడంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలాశయంలో మత్స్య సంపద పెరగడం కోసం జులై, ఆగస్టుల్లో వేట నిషేధిస్తారు. ప్రస్తుతం 53టీఎంసీల నీరు నిల్వ ఉంది. అసలే చేపలు తగినంత పడక మత్స్యకారులు ఇబ్బందులు పడుతుంటే అక్రమార్కులు అలివి వలలతో వేటకు సిద్ధమయ్యారు. దీంతో తమ జీవనభృతి దెబ్బతింటుందని ఆవేదన చెందుతున్నారు.

పట్టించుకోకనే..

సోమశిల జలాశయం మొదటి రెండు కిలోమీటర్లు నెల్లూరు జిల్లాలో ఉంటుంది. మిగిలిన ప్రాంతం కడపజిల్లాలో ఉంటుంది. ఇటు నెల్లూరు అధికారులు తమ ప్రాంతంలో జలాశయం అధిక లోతులో ఉంటుందని అక్కడ అలివిలతో వేట సాధ్యం కాదని చెబుతున్నారు. దీంతో మిగిలిన ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. అటు కడపజిల్లా అధికారులూ మిన్నకుండిపోతున్నారు. మొత్తానికి రెండు జిల్లాల అధికారుల నిర్వాకంతోనే అక్రమవేట యథేచ్ఛగా జరుగుతుంది. కడపజిల్లా కొత్తూరు, వెంగళాయపల్లి, గోపవరం మండలం పరిధిలోని నీటినిల్వ ప్రాంతాల్లో ఈ అక్రమ వేట జోరుగా సాగుతోంది.


అలివి వలలతో పడవ (పాతచిత్రం)

సమన్వయంతో పనిచేస్తేనే..

రెండు జిల్లాల మత్స్యశాఖ అధికారులు, పోలీస్ అధికారులతో ఉమ్మడి బృందంగా ఏర్పాటై.. పర్యవేక్షిస్తే అక్రమ వేటకు అవకాశమే ఉండదు. రెండు దశాబ్దాలుగా ఈ తంతు సాగుతున్నా.. సమన్వయ లోపంతో ఇప్పటి వరకు ఉమ్మడి తనిఖీ బృందం ఏర్పాటు కాలేదు. ఇదే అక్రమార్కుల పాలిట వరంగా మారింది.

ఆ అవకాశమే లేదు నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

అలివిలతో జిల్లా సరిహద్దులో వేటాడే అవకాశమే లేదు. మత్స్యకారులు అలివి వలలతో వేట సాగించేవారిని పట్టుకొని అప్పగిస్తే చర్యలు తీసుకుంటాం. కడపజిల్లా పరిధిలో అక్రమ వేట సాగుతుందని ఆ జిల్లా అధికారులకు సమాచారం ఇస్తాం.



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకోండి: ఎస్పీ

నెల్లూరు(నేర విభాగం): దసరా సెలవుల్లో ఇంటికి తాళాలు వేసి ఊర్లకు వెళ్తున్నారా? దొంగతనాలు జరగకుండా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకుని ఇళ్లల్లో చోరీలు జరగకుండా చూడాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. యాప్ ద్వారా గానీ.. 94407 96383, 93929 03413 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ యాప్ ద్వారా ఉచితంగా సేవలు పొందవచ్చున్నారు. రాత్రి వేళ అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. పండగ సందర్భంగా పెద్ద కంపెనీలు ఆఫర్లు ప్రకటించాయనీ, వీటిని ఆసరాగా చేసుకుని సైబర్ మోసగాళ్లు బరితెగించే అవకాశాలు ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రాంతీయ మహాసభను విజయవంతం చేయాలి

ఉదయగిరి : పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఈనెల 13న జరిగే సీపీఎం ప్రాంతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వెనుకబాటు ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సోమశిల జలాలను ఉదయగిరికి తరలించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. బండగానిపల్లి ఘాట్ రోడ్డు, ఉదయగిరి- నందవరం రోడ్లు పూర్తి చేయాలన్నారు. డిసెంబరులో ఇందుకూరుపేటలో జిల్లా మహాసభలు నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతాయన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఇద్దరి ఆత్మహత్య

కోవూరు, న్యూస్‌టుడే: మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పడంతో ఒకరు ఫ్యానుకు ఉరేసుకోగా, మరొకరు మద్యంలో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు కోవూరు పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగాయని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు.. ఆయన వివరాల మేరకు.. పెద్దపడుగుపాడు ఎన్టీఆర్ కాలనీకి చెందిన సురేష్(39) పెయింటింగ్ పనులు చేసుకొని జీవిస్తున్నారు. నిత్యం మద్యం తాగి భార్యతో గొడవపడుతున్నారు. తాగొద్దని భార్య తీవ్రంగా మందలించారు. రెండు నెలల క్రితం భార్య మీద కోపంతో కూలీపనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈనెల 5న తిరిగొచ్చి తల్లిదండ్రుల వద్ద ఉన్నారు. ఆదివారం మద్యం తాగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని మృతిచెందారు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● కోవూరులోని చెరువుకట్టసంఘం కాలనీకి చెందిన ముకేశ్(39) మద్యం తాగి నిత్యం భార్యను వేధిస్తుండటంతో పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు ఇంటికి రావాలని కోరినా నిరాకరించడంతో మానసిక వేదనకు గురై ఈనెల 1న మద్యంలో గడ్డిమందు కలిపి తాగారు. నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



అప్పుల బాధతో
జడ్పీటీసీ సభ్యుడి ఆత్మహత్య

కావలి, గుడ్లూరు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో కందుకూరు నియోజకవర్గంలోని గుడ్లూరు జడ్పీటీసీ సభ్యుడు **కొరిసిపాటి బాపిరెడ్డి** (56) ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుడ్లూరు మండలంలోని గుండ్లపాలేనికి చెందిన ఆయన గత జడ్పీ ఎన్నికల్లో మండలం నుంచి వైకాపా అభ్యర్థిగా విజయం సాధించారు. కొన్నేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం చేస్తూ కావలి పట్టణంలో స్థిరపడ్డారు. ఆయన నిర్మించిన భవనాలు ఇటీవల పూర్తిస్థాయిలో అమ్ముడుపోలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రుణాలు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో కోఆపరేటివ్ కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యారు. గమనించిన సిబ్బంది పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సకు చేర్చారు. పరిస్థితి విషమించడంతో నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. కావలి రెండో పట్టణ ఎస్సై గౌస్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు.

తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానం శివభారత కావ్యం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: దివంగత డాక్టర్ గడియారం వెంకటశేషశాస్త్రి శివభారతం కావ్యాన్ని రచించి తెలుగు సాహిత్యంలో సుస్థిరస్థానం పొందారని డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అన్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో మహాకవి డాక్టర్ గడియారం వెంకటశేషశాస్త్రి సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గడియారం రచించిన శివభారత కావ్యం ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చిందన్నారు. గడియారం పేరుతో రచన సాహిత్య వేదిక ఆయన కుటుంబీకులు ఏర్పాటు చేసి అవార్డులివ్వడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు రచించిన 'శంభుభారతం' కావ్యానికి పురస్కారం ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. ప్రధాన వక్త కొండపి మురళీ మాట్లాడుతూ డాక్టర్ సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు శంభుభారతం కావ్యాన్ని అద్భుతంగా రచించారని కొనియాడారు. రచన సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు గడియారం వెంకట శేషశర్మ మాట్లాడుతూ సాహితీవేత్తలను ప్రోత్సహించేందుకు తాము గడియారం పురస్కారాలను ఏటా అందజేస్తున్నామన్నారు. అనంతరం సింగరాజుకు గడియారం వెంకటశేషశాస్త్రి అవార్డును ప్రదానం చేసి జ్ఞాపికతో సత్కరించారు.

పేదింటి బిడ్డలు.. కబడ్డీలో ప్రతిభావంతులు

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో సత్తాచాటుతున్నారు.. ఆసక్తి ఉంటే పేదరికం అడ్డుకాదని నిరూపించారు.. ఉన్న వనరులు సద్వినియోగం చేసుకొని విశేష ప్రతిభ చూపుతున్నారు.. చదువుతో పాటు క్రీడల్లో ఆడే సమయంలో ఒక లక్ష్యంతో ముందుకు సాగితే ఏదో ఒక రోజు సాధించి తీరుతామన్న ఆత్మవిశ్వాసంతో మరింత మెరుగ్గా రాణిస్తున్నారు. వారికిష్టమైన కబడ్డీ క్రీడలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సొంతం చేసుకున్నారు... క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంతో సాధన చేస్తున్న బుచ్చికి చెందిన యువకులపై ప్రత్యేక కథనం

● పేరు ● చదువు ● తల్లిదండ్రులు ● సాధించిన విజయాలు ● లక్ష్యం

బరిలోకి దిగితే విజయమే..



● ఈదూరు రోహిత్ ● ఇంటర్ ● వెంకటరమణయ్య (వ్యవసాయ కూలి), వనజ (గృహిణి) ● బుచ్చి అంబేడ్కర్ నగర్‌కు చెందిన రోహిత్ తండ్రికి క్రీడలంటే ఎంతో ఇష్టమవడంతో చిన్నప్పటి నుంచి ప్రోత్సహించారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మార్చిలో అండర్-17 విభాగంలో జాతీయస్థాయిలో జరిగిన క్రీడల్లో పాల్గొని సత్తాచాటారు. విజయవాడ, తూర్పుగోదావరి, చిత్తూరు తదితర ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. ● పోలీసు విభాగంలో ఉద్యోగం

కూత పెడితే.. పతకమే



● గద్దె కార్తిక్ ● డిగ్రీ మూడో ఏడాది ● నిరంజన్(తాపీమేస్త్రి), జమీలా (బీడీ కార్మికురాలు) ● బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన కార్తిక్ సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో కబడ్డీలో ఉత్తమ ప్రతిభ చూపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో ఆల్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సొంతం చేసుకున్నారు. విజయవాడ, నెల్లూరు, తూర్పుగోదావరి, కాకినాడ, చిత్తూరు తదితర ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. ● పోలీసు కొలువు

తనదైన శైలిలో రాణిస్తూ..



● కొట్టు పవన్‌కల్యాణ్ ● డిగ్రీ ● సుధాకర్, విజయమ్మ (వ్యవసాయ కూలీలు) ● చిన్నప్పటి నుంచి క్రీడల్లో ఉత్తమంగా రాణిస్తున్నారు. అండర్ 14, 17, 19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించారు. ఏప్రిల్‌లో బెంగళూరులో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ కబడ్డీ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరిగిన టోర్నీలో పాల్గొని రాణించారు. ● రైల్వే ఉద్యోగం

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు





కావలి: గాయత్రిగా కనకదుర్గ అమ్మవారు..సీతారామపురం : గజలక్ష్మీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి.. ఉదయగిరి: శివాలయంలో లలితాత్రిపుర సుందరిగా..

దుర్గమ్మా.. కరుణించమ్మా



గుడ్లూరు: పూజలు చేస్తున్న భక్తులు



బిట్రగుంట: బోగోలులో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆదివారం జరిగిన పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




కందుకూరు: అన్నపూర్ణదేవిగా వింజమూరు:చండీ అలంకారంలో

తిరుమలలో రచయితకు సన్మానం

కలిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని తెల్లపాడుకు చెందిన పుస్తక రచయిత మారెళ్ల వెంకటశేషారెడ్డికి ఆదివారం తిరుమలలో ఘనంగా సన్మానం జరిగింది. తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా సింహ వాహన సేవలో 'మహాభారతం ప్రశ్నావళి' అనే పుస్తకాన్ని రచించారు. దీని ఆవిష్కరణ తిరుమలలో జరగ్గా దేవస్థానం తరఫున సన్మానం చేశారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న వెంకటశేషారెడ్డి

వానొస్తే నరకమే!

చెరువులు, కాలువల ఆక్రమణల ఫలితం

ఇది పట్టణంలోని వైకుంఠపురం సమాధుల ప్రాంతంలో మురుగు కాలువ. ఆక్రమణలతో ఓ వైపున అయిదారు అడుగుల వెడల్పుతో కనిపిస్తోంది. పడమర దిక్కున ఓ సన్నని కాలువగా మారింది. వర్షాలొచ్చినప్పుడల్లా ఇది పొంగుతోంది. వైకుంఠపురం ప్రాంతంలో నివాసాలు నీట మునుగుతున్నాయి. పట్టణంలో అయిదు కిలోమీటర్ల పొడవున సాగే ఈ కాలువలో ఆక్రమణలతో పూడికతీయాలన్నా వీలు కావడం లేదు.





ఇది పట్టణంలోని అనపగుంట. పూడిక, ముళ్ల కంప, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. భారీ వర్షాలొస్తే పొంగుతుంది. సమీపంలో ఉన్న చాలా ఇళ్లు మునుగుతున్నాయి. దీన్నుంచి వచ్చే వరద పోటెత్తితే కట్ట గోళ్లమూడి మీదుగా ప్రధాన పట్టణానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. 20 ఎకరాల వరకు ఉండాల్సిన ఈ చెరువు ప్రస్తుతం రెండున్నర ఎకరాలకే పరిమితమైంది.

కావలి, న్యూస్‌టుడే: వర్షాకాలం వచ్చింది. తరచూ వానలు కురుస్తున్నాయి. చినుకు పడితే పట్టణవాసులు వణికిపోతున్నారు. నీరు ఇళ్లలోకి వస్తోందేమోనని హడలిపోతున్నారు. కొంతమంది ఆక్రమణల కారణంగా వేలాది మంది అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలొస్తే వైకుంఠపురం, మద్దిచెట్టు గిరిజన కాలనీ, సంకలవారితోట, పాతూరులోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. పట్టణం రోజురోజుకీ విస్తరిస్తోంది. స్థలాల విలువ పెరిగింది. దీంతో పంట కాలువలను ముడుచుకుపోయేలా మారిపోయాయి. మరోవైపు వీటిని ఆక్రమించి నిర్మాణాలు కట్టారు. పట్టణంలో 45 కిలోమీటర్ల వరకు మేజర్, మధ్యతరహా కాలువలు ఉన్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. వీటిలో వర్షాకాలానికి ముందుగా తప్పనిసరిగా పూడిక తీయాల్సి ఉంది. కానీ పైపైన తీసి వదిలేస్తున్నారు. అనపగుంటలో ఆక్రమణలు తొలగించి పూడిక తీసి అభివృద్ధి చేస్తామన్న ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. మద్ది చెట్టు గిరిజన కాలనీకి తమ వైపు భవనాలు నిర్మించిన వారు తమ పరిసరాల్ని ఎత్తుగా చేసుకున్నారు. దీంతో వరద నీరంతా ఈ గిరిజన కాలనీని ముట్టుముడుతోంది.

ముంపు లేకుండా చూస్తాం

కాలువల్లో ఇప్పటికే పూడిక తీయించాం. భారీ వర్షాలొచ్చినా ముంపునకు గురికాకుండా చూస్తాం. పురపాలకం తరఫున మెరుగైన సేవలందిస్తాం.
శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి

ఆకట్టుకుంటున్న స్తంభాల వరుస



మండలంలోని పోట్లూరు- పాజర్ల మధ్య రహదారికిరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు ఆకట్టుకుంటున్నాయి. రహదారి అంచుల్లో రెండు వైపులా మూడు కి.మీ. మార్గంలో 300 పైగా స్తంభాలున్నాయి. దూరం నుంచి చూస్తే వీటి మధ్య దారి ఉందా? అనే సందేహం కలుగుతుంది. ఈ మార్గంలో రాకపోకలు చేసే వారు రాత్రి సమయాల్లో ఈ స్తంభాలను చూసి అక్కడ ఎవరో ఉన్నారనే భ్రమపడుతున్నామంటున్నారు. **- న్యూస్‌టుడే, గుడ్లూరు**

తవ్వారు.. వదిలేశారు!



ఈ చిత్రంలో కనిపించేది కావలి పట్టణంలోని అళహరివారి వీధి వద్ద ధ్వంసమైన అంతర్గత రహదారి. పైపులైన్లు, ఇతర అవసరాల కోసం తవ్వేస్తున్నారు. వ్యక్తిగత కుళాయి కనెక్షన్ల కోసం తవ్వితే సదరు దరఖాస్తుదారుడే ఆయా గుంతలను బాగు చేయించాలి. అలా పురపాలకంలో జరగడం లేదు. ఈ విషయమై కావలి పురపాలక డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సాయిరాం మాట్లాడుతూ ధ్వంసమైన రహదారులను బాగు చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, కావలి**

గోతులతో ప్రమాదాలు



మండలంలోని తెల్లపాడు నుంచి కలిగిరి- కొండాపురం గ్రామాలను కలిపే రహదారిపై నరసారెడ్డిపాలెం సమీపంలో ఉత్తర కాలువ వంతెన వద్ద రోడ్డు దెబ్బతింది. వంతెనకు రెండు వైపులా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసినా వీటిల్లో నీరు చేరుతోంది. బురదలో వాహనాలు జారి పడిపోతున్నాయి. వేగంగా వచ్చే వాహన చోదకులు గోతుల్లోకి అకస్మాత్తుగా వాహనాలు దించి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ర.భ ఏఈ అహ్మద్‌బాషాను వివరణ కోరగా గోతుల పూడ్చివేతకు చర్యలు చేపడతామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కలిగిరి**

నిర్లక్ష్యం మానులై!



ఈ చిత్రం చూశారు కదూ! ఇది గ్రామ పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. చేదురు బావిలో మర్రి, రావి చెట్లు పెరిగాయి. నీటి కొరత ఉన్నప్పుడు ఈనీటిని వినియోగించడానికి అవకాశం ఉంది. చెట్లు పెరగడంతో నిరుపయోగంగా మారింది. ఇదీ సీతారామపురం మండలం నాంచారమ్మపల్లిలో కంచంరెడ్డి నారాయణరెడ్డి బావిలో ఈపరిస్థితి నెలకొంది.
- సీతారామపురం, న్యూస్‌టుడే

తీరంలో ఘర్షణ

కావలి, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలపెంట సముద్ర తీరంలో ఘర్షణ జరిగింది. ఆదివారం సరదాగా సముద్రానికి వెళ్లిన వెంగళరావునగర్ వాసుల్ని సర్వాయపాలేనికి చెందిన నలుగురు ఇబ్బంది పెట్టారు. మహిళ ముందు అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో వాదనలు చోటుచేసుకుని ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు సర్ది చెప్పి పంపించారు. వెంగళరావునగర్‌వాసులు కావలికి వస్తుండగా వెంబడిస్తూ వచ్చి బైక్‌పై ఉన్న ఒకరిపై దాడికి పాల్పడ్డారు. ఆటోలో ఉన్న వారంతా వారిని చుట్టుముట్టారు. ఇద్దరు పరారు కాగా, మిగిలిన వారిని పోలీసులకు అప్పగించేందుకు స్టేషన్‌కు తీసుకొచ్చారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు : మండలంలోని నరసాపురం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. లింగసముద్రం మండలంలోని మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వెంకటరావు తెలిపారు. వీటికి అపరాధరుసుం విధించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో గాయాలైన యువకుడి మృతి

కావలి, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వైనమిది. ప్రకాశం జిల్లా చీమకుర్తి పట్టణంలోని తూర్పుపాలేనికి చెందిన శివచేతన్ (21) శనివారం వ్యక్తిగత పనిపై నెల్లూరుకు వచ్చి తిరిగి వెళుతున్నాడు. పట్టణ శివారు మద్దూరుపాడులో జాతీయ రహదారిపై అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. గాయాలైన అతన్ని హైవే అంబులెన్స్‌లో కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు.

చోరీకి యత్నం.. ఒకరి పట్టివేత

కావలి : పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన ఇద్దరు యువకులు ఓ ఆటోలోని బ్యాటరీని తస్కరించి పరారవుతూ పోలీసులకు చిక్కిన వైనమిది. ఆదివారం జెండా చెట్టు కూడలి సమీపంలో పార్కు చేసిన ఆటోలో బ్యాటరీ అపహరిస్తుండగా చోదకుడు గమనించి కేకలు వేశాడు. బైక్‌పై వచ్చిన ఆ యువకులు వేగంగా పరారవుతూ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొని పడిపోయారు. వారిని వెంబడిస్తూ వచ్చిన స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఒకరు తప్పించుకోగా మరో యువకుడ్ని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి గాయపడగా ఆసుపత్రిలో చేర్చారు.

గుర్రపుడెక్క.. తొలగిస్తేనే సాగు



ఎటీఎస్ ఛానల్‌లో గుర్రపుడెక్క ఆకు

అల్లూరు, న్యూస్‌టుడే

డెల్టాలో గుర్రపుడెక్కతో రైతులు నష్టపోతున్నారు. సాగుకు ఇబ్బందికరంగా మారింది. కాలువల్లో ఇది పెరగడంతో నీరు సాఫీగా చేలకు రావడం లేదు. దీని తొలగింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మొదటి పంట సాగుకు నీరు ఇచ్చేందుకు సాగునీటి సలహా మండలి సమావేశం త్వరలో జరగనుంది. నీటి విడుదలకు ముందే కాలువల్లో దీన్ని పూర్తిగా తొలగించాల్సి ఉంది. హడావుడిగా పనులు చేస్తే రైతులకు సాగు మధ్యలో సమస్యగా మారే ప్రమాదం ఉంది. డెల్టాలో దాదాపు 45 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. వీటికి నీరు అందించే ప్రధాన, చిన్న కాలువల్లో ఈ ఆకు అల్లుకుపోయింది. ఈనెల 20 నుంచి రైతులు నార్లు పోయనున్నారు.

వేటిల్లో ఉందంటే..

అల్లూరు స్వాంపు, పైడేరు, కలుజు, చెంగల్ తదితర వాగులు గుర్రపుడెక్కతో నిండిపోయాయి. గతంలో వరదల సమయంలో నీరు బయటకు పోకపోవడంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. రెండుసార్లు నార్లు పోసి నష్టపోయారు. కొంత ప్రాంతంలో నారు పోసేందుకు వీల్లేకపోవడంతో బయట కొనుగోలు చేశారు. ఇందుకు ఎకరాలో నాట్లకు రూ.మూడు వేల వరకు ఖర్చు చేశారు. పాలకులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ కాకు సుధీర్‌ను వివరణ కోరగా పంట కాలువల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే చేస్తామన్నారు.

కులగణన చేసి రిజర్వేషన్లు అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకుడు సాగర్

కందుకూరు పట్టణం : దేశవ్యాప్తంగా కులగణన చేసి అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీఎస్.సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబా పులే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినం సందర్భంగా పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బాలురోన్నత పాఠశాలలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షత వహించారు. సాగర్ మాట్లాడుతూ ప్రజల మధ్య ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు ఇంకా తొలగలేదన్నారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు అమలుచేస్తే కులాల మధ్య అంతరాలు తొలుగుతాయన్నారు. సీపీఐ నాయకులు మాలకొండయ్య, సురేష్, ఇతర సంఘాల నాయకులు గౌస్, ఆర్.మోహన్, కె.నాంచార్లు, పి.కోటేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల ఆర్థిక సాయం

కందుకూరు పట్టణం: పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులు తాము దాచుకున్న నగదును వరద బాధితుల సహాయార్థం అందజేశారు. తొమ్మిదేళ్ల ఎన్.హృతిక, నాలుగేళ్ల ఎన్.నవిష్క రూ.23,500 నగదును ఆదివారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజను కలిసి అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మన వంతు సాయం చేయాలని తల్లిదండ్రుల సూచించడంతో దాచుకున్న నగదు విరాళంగా ఇస్తున్నట్లు చిన్నారులు తెలిపారు.

జిల్లా ఏర్పాటుతోనే ఉదయగిరి అభివృద్ధి

ఉదయగిరి : అనాదిగా అన్నిరకాలుగా వెనుకబాటుకు గురైన ఉదయగిరి అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయాల్సిందేనని జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు డాక్టరు కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. జిల్లా సాధన సన్నాహక సదస్సు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందుకు నిబంధనలు సడలించి ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ కార్యదర్శి దస్తగిరి అహమ్మద్, నాయకులు ఖాదర్‌బాషా, రామిరెడ్డి మాట్లాడారు.

యువకుడిని రక్షించిన పోలీసులు

సింగరాయకొండ గ్రామీణం: ఆత్మహత్యకు యత్నిస్తున్న యువకుడిని పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరులోని జనార్దన్ కాలనీకి చెందిన షేక్ అన్సారీ రెండో కుమారుడు షబ్బీర్ హైదరాబాద్‌కు చెందిన యువతితో నాలుగేళ్లుగా కందుకూరులో సహజీవనం చేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె నాలుగు నెలల క్రితం షబ్బీర్‌తో గొడవపడి హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఆ నేపథ్యంలో షబ్బీర్ ఆదివారం ద్విచక్ర వాహనంపై ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి వద్ద రైలుపట్టాలపై ఆత్మహత్యకు యత్నిస్తుండగా..సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి కాపాడారు. కౌన్సెలింగ్ ఇచ్చి సోదరుడికి అప్పగించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎన్‌సీసీ 23ఏ, 24ఎ, 34ఎ, 2ఎ తదితర బెటాలియన్లకు చెందిన సుమారు 550 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 10 రోజులు పాటు జరిగే కార్యక్రమంలో ఫైరింగ్, డ్రిల్, ఫిజికల్, నాయకత్వ లక్షణాలు పెంపొందేలా శిక్షణ ఇవ్వనున్నారు.

వారు వస్తే పార్టీకి నష్టం: మాలేపాటి

కావలి, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు పార్టీలోకి వస్తే క్యాడర్‌కు నష్టం జరుగుతుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ఆరోపించారు. గత వైకాపా పాలనలో జరిగిన అకృత్యాలను ఏకరవు పెట్టారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. పోలీసుస్టేషన్లే సాక్షిగా అనేక అవమానాలు జరిగాయన్నారు. అడుగడుగునా దౌర్జన్యాలకు పాల్పడి క్షోభకు గురిచేశారన్నారు. ఇప్పుడు మా పార్టీ అధికారంలోకి రాగానే చేరేందుకు ఆ నాయకులు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి వారి రాకను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

వరికుంటపాడు : వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వీటిలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి స్థానిక తెదేపా నాయకులతో కలసి పాల్గొన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెంకన్న చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు.

In The Court of The Senior Civil Judge, Atmakur
I.P. No.5/2024
Mettukuru Padmanabareddy - Petitioner
Vs
1.Maddala Yanadireddy
2.Maddala Saraswathi
3.Malla Lakshminarasaiah
4.Mettukuru Venkateswarlu
5. Mettukuru Venkata Subbareddy
6. Rapuru Subbaiah
7.Rapuru Rajeswari
8.Chinta Suseelamma
9. Suryam Latha
10. Palliboyana Ramanaiah
11. Palliboyana Madhavi
12. Puchakatla Narasimhulu
13. Koppala Ravi
14. Gotham Dayakar
15. Koppala Suresh
16. Palliboyana Srinivasulu
17. Palliboyana Kishore
18. Palliboyana Gopi
19. Mulem Veera Reddy
20. Mulem Channa Reddy
21. Mettukuru Subba Reddy
22. Tanabala Subramanyam
23. Palliboyana Venkateswarlu
24. Bhemavarapu Janardhan Reddy
25.Sanku Sivaiah
26. Verri Danamma
27.Mettukuru Suseelamma
28.Mettukuru Rathnamma
29. Shaik Sandani
30. Shaik Abid
31. Shaik Musthab
- Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో ఐ.పి. 5/2024 పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల తేది 22-11-2024న వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది.

Ch. హరికృష్ణ, B.Sc., LLB.,
అడ్వకేటు, ఆత్మకూరు

In the Court of the Principal Senior Civil Judge, Nellore
I.P. No. 45/2024
Thunga Eswar Naidu ... Petitioner
Vs.
1. Mandava Rangarao
2. Ambati Nageswara Reddy
3. Akkem Veera Raghavulu
4. Kotte Chinna Bhavani
5. Sava Mahesh
6. Taneeru Ranjith Kumar
7. Taneeru Srinivasulu
8. Mannem Ramana Reddy
9. Sava Madhavi
10. Ravilla Venkateswarlu
11. Malapati Haritha
12. Malapati Lakshmi Sahiti
13. Kilari Sundara Ramanaidu
14. Bollineni Seshaiah
15. Goli Prabhavathi
16. Bellam Bala Krishna
17. Koppolu Venkateswarlu Naidu
18. Koppolu Penchalamma
19. Voyugundla Syamsundar Rao
20. Voyundla Venkata Siva Dhanush
21. Vouyugondla Seethamma
22. Amara Padmavathi
23. Kumara Srihari
24. Pala Padmamma
25. Ravilla Adilakshmamma
26. Modepalli Sriramulu
27. Cherukuri Madhu
28. Tumati Venkata Seshaiah Naidu
29. Maddineni Chenchaiah Naidu
30. Challa Krishnavenamma
31. Aluri Srinivasulu Reddy
32. Dindu Venkata Ramanaiah
33. Sava Ramanamma
34. Boyapati Jayaramaiah
35. Rapuru Venkata Subbareddy
36. Grandi Venkata Krishnaiah
37. Cherukuri Bhagyamma
38. Pamulapati Rathnamma
39. Tirumala Damodara Naidu
40. Devarala Suresh Babu
41. Koram Sreehari
42. Napa Ramanamma
43. Cheerla Masthanaiah
44. Kondra Srinivasulu Reddy
45. Konda Suryakumari
46. Duddigunta Varalakshmi
47. Napa Pedda Subbaiah
48. Talla Veeraiah Goud
49. Tirumala Chandrasekhar Naidu
50. Modepalli Peda Penchalaiah
51. Kommi Venkata Rama Naidu
52. Devara Rosaiah
53. Bollineni Guru Prasad
54. Bollineni Venkata Narasaiah
55. Gangavarapu Kondamma
56. Bollineni Bujjaiah Naidu
57. Dornaala Suresh Babu
58. Yerrasingh Krishnaiah
59. Boganadam Naga Suresh Babu
60. Yerragunta Ravindra Reddy
61. Naga Ramana Reddy
62. Koppolu Subbarathnamma
63. Kumara Srikala
64. Somisetty Srinivasulu
65. Pavuluri Sravanthi
66. Martula Malyadri Reddy
67. Sana China Obul Reddy
68. Voddiboina Venkata Sesha Reddy
69. Paluri Penchal Reddy
70. Tanneru Venkata Ramanaiah
71. Vommina Srinivasa Rao
72. Vommina Sujatha
73. Munagala Nagendra Reddy
74. Garre Nirmala
75. Bollineni Suman Naidu
76. Bogireddy Obul Reddy
77. Vadlamudi Simhadri Naidu
78. Vadlamudi Sujatha
79. Kankanala Praveena
80. Kopalli Ramaiah
81. Veerapareddy Amaravathi
82. Sakamuri Surendra Naidu
83. Bollineni Malakondaiah
84. Kotte Penchalamma
85. Chirumamilla Venkatadri
86. Chatagunta Sulochana
87. Narapaneni Prabhakar Naidu
88. Mukkamulla Venkat Reddy
89. Kolli Rathnaiah Naidu
90. Kankanala Venkata Subbamma
91. Cheerla Rami Reddy
92. Yerragolla Rathnamma
93. Nune Lakshmi Devi
94. Sura Rami Reddy
95. Kolli Thirupathi Naidu
96. Badikalla Venkateswarlu
97. Satukumati Manoj Kumar
98. Sreeram ramanamma
99. Bandela Penchala Narasimhulu
100. Kumara Venkata rayulu
101. Madupuri Padmavathi
102. Kurapati Srilatha
103. Tirumala Hymavathi
104. Yerragunta Srinivasula Reddy
105. Jonnadula Subbarayudu
106. Sakhamuri Surendra Naidu
107. Sri Venkateswara Rythu Depot Gouravaram, Kavali, Nellore Dist.
108. Yeduti Bhaskar Naidu
... Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో ఐ.పి. 45/2024 పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ: 28-10-2024న వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది.

పువ్వాడి శంకరయ్య, B.A., B.L.,
సి. అచ్యుత్‌రామన్, B.Com., B.L.,
అడ్వకేట్లు, నెల్లూరు.

మైదానాలు ఇలా.. ఆటలెలా?



ఇది సీతారామపురం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానం. ఇందులో కంప చెట్లు పెరగడంతో చిట్టడవిని తలపిస్తోంది. బాలలు అందులోకి దిగేందుకు వీల్లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై నెలకొన్న వివాదం కారణంగా కొన్నేళ్లుగా వినియోగించడం లేదు.



అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాల మైదానం ఇది. మండల స్థాయి పోటీలు ఇందులోనే నిర్వహిస్తున్నారు. ఇందులో రాళ్లు ఉన్నాయి. కొంతమేర నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, సీతారామపురం

మానసిక, శారీరక ఆరోగ్యానికి ఆటలు ముఖ్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశాల్లో చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. దీంతో విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరమవుతున్నారు. కొన్నిచోట్ల మైదానాలు ఉన్నా. . నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటలకు వీలు కావడం లేదు. నిర్వహణకు నిధుల కొరత ఇందుకు ఓకారణంగా చెబుతున్నారు. మండలంలోని ఓగూరువాండ్లపల్లి ఉన్నత పాఠశాలకు మైదానం ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అది ఎక్కడుందో పాఠశాల తెలియడం లేదు. దీంతో పాఠశాల ముందున్న స్థలంలో ఆడుకొంటున్నారు. పరుగు పందెం రహదారిపై ఏర్పాటుచేస్తున్నారు. సీతారామపురం కేజీబీవీ పాఠశాలకు స్థలం ఉన్నా పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. ఆదర్శ పాఠశాలలోనూ ఇదే దుస్థితి. ఇప్పటికైనా పాలకులు స్పందించి మైదానాలు అభివృద్ధి చేసి విద్యార్థులు ఆటలు ఆడేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరైతే చేస్తాం

ఆట స్థలాల అభివృద్ధికి నిధులు మంజూరైతే పనులు చేయించేందుకు అవకాశం ఉంది. సీతారామపురం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానం కోర్టు వివాదంలో ఉంది. ఓగూరువాండ్లపల్లిలో ఎక్కడ ఉందో సర్వే చేసి చూపించాలని రెవెన్యూ అధికారులను కోరాం. నిధులు మంజూరైతే ఇతర పాఠశాలల్లో పెరిగిన చెట్లు తొలగిస్తే వినియోగించుకునేందుకు అవకాశం ఉంది.
మస్తాన్‌వలి, ఎంఈవో, సీతారామపురం

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: పూరేటిపల్లిలో ప్రధానవీధి, కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- జి.పరమేశ్**
సమాధానం: పరిశీలించి వెలిగించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వరరావు, ఎంపీడీవో - న్యూస్‌టుడే, గుడ్లూరు**

? రామానుజాపురంలోని ఎస్సీ కాలనీలో నీటి పథకం మోటార్ మరమ్మతులకు గురై ఏడాదైనా పట్టించుకోలేదు. **- మణికుమార్, గ్రామస్థుడు**
✓ పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- జిలానీ బాషా, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

? విద్యుత్తు సరఫరాలో అంతరాయాలతో ఇబ్బందిగా ఉంది. **- ఈశ్వరయ్య, రాజావీది**
✓ అవాంతరాలు రాకుండా చూస్తాం.
- వసంతరావు, ఏఈ, - న్యూస్‌టుడే, కావలి

? నూకవరం మార్గంలో తారురోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను వేయడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. **- వెంకటేశ్వర్లు, స్థానికుడు**
✓ వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లిస్తా. వ్యర్థాలు వేయకుండా చూస్తాం. **-వేణు, కార్యదర్శి, - వలేటివారిపాలెం, న్యూస్‌టుడే**

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

ఇస్రో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

కోవూరు, న్యూస్‌టుడే: ఇస్రో ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్ 2024 కార్యక్రమంలో భాగంగా తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 5న నిర్వహించిన 'వాతావరణ మార్పులు- సవాళ్లు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని పాటూరు విద్యార్థి రూపేశ్ రమాకాంత్ రెడ్డి ప్రథమ బహుమతిని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు.

9 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

మనుబోలు, న్యూస్‌టుడే: దసరా సెలవులను పురస్కరించుకుని యువతను క్రీడలపై ఆసక్తి కనబరిచేలా 9 నుంచి మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో 9 నుంచి 12 వరకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. సింగిల్స్, డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని పెగళ్లపాడులో జనసేన జెండాను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నలిశెట్టి శ్రీధర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు జనసైనికులు కృషిచేయాలన్నారు.

గ్యాస్ లీకేజీతో పూరిల్లు దగ్ధం

కోవూరు, న్యూస్‌టుడే: ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైన ఘటన ఇనమడుగు పంచాయతీలోని జమ్మిపాలెంలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన బత్తిన శేషయ్య ఇంట్లో భార్య వంట చేస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారి ఇల్లంతా మంటలు అలముకున్నాయి. ఇంట్లో ఉన్న వారు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. మూడు సవర్ల బంగారం, రూ.25వేల నగదుతో పాటు సామాగ్రి మొత్తం కాలిపోయాయని బాధితులు వాపోయారు. అగ్నిమాపక శాఖాధికారులు వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

సీహెచ్‌సీలో కంటి విభాగం మూత

న్యూస్‌టుడే, పొదలకూరు

పన్నెండు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న రోగుల అవస్థలు

పొదలకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కంటి విభాగం పన్నెండు రోజులుగా తెరుచుకోవడం లేదు... చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలందించి అద్దాలు ఉచితంగా అందించేవారు. కొన్నేళ్ల క్రితం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి ఒప్పంద పద్ధతిలో అప్పగించడంతో ఎంతో మందికి ప్రయోజనం చేకూరింది. కొన్ని రోజుల క్రితం గడువు ముగియడంతో కంటి విభాగాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ప్రతి రోజూ వివిధ పరీక్షల కోసం, అద్దాల కోసం వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకొని అద్దాలు తీసుకునేవారు. ఎక్కువగా పొదలకూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు, సైదాపురం మండలాల నుంచి రోజుకు సుమారు 30 నుంచి 50 మంది వరకు పరీక్షల కోసం వచ్చేవారు. నెలకు 20 నుంచి 30 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించేవారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో పరీక్షించుకోవాలంటే ఓపీ రూ.300, కంటి అద్దాల కొనుగోలుకు సుమారు రూ.2000, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ.2500 వరకు వెచ్చించాల్సి వస్తోంది. సేవలు నిలిచిపోవడంతో పేదలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఆరేళ్లుగా కంటి విభాగంలో సుమారు 27,992 మందికి కంటి పరీక్షలు, అద్దాలు అందించినట్లు ఆ విభాగం ప్రతినిధి మస్తానయ్య తెలిపారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి నెల్లూరు, వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా చేయించేవారు. నేత్ర పరీక్షల కోసం వచ్చేవారు పది రోజులుగా సంబంధిత వైద్యులు లేక రోజూ రోగులొచ్చి నిరీక్షించాల్సి వస్తోంది.



తెరచుకోని గది

● సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ... కంటి విభాగానికి సంబంధించి ఆరేళ్లుగా ఒక సంస్థ వారితో ఒప్పందంలో భాగంగా సేవలందించారన్నారు. వారి గడువు ముగిసిందని, ప్రభుత్వం వేరేవారికి టెండర్లు నిర్వహించి అప్పగించేందుకు కొంత సమయం పడుతుందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

విడవలూరు, న్యూస్‌టుడే: పొన్నపూడి లక్ష్మీపురంలో దసరా మహోత్సవాలు 10వ తేదీ నుంచి 12 వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 63084 54770 చరవాణి నంబరుకు సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీ

మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 9 నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఆర్‌పీ నాగార్జున్ తెలిపారు. డీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో రూ.5.93 కోట్లతో 396 పనులు చేసినట్లుగా ఆయన వివరించారు.

వేగ నియంత్రికలు ఏర్పాటు

మర్రిపాడు: ముంబయి జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకునే బ్లాక్ స్పాట్లను గుర్తించి వేగ నియంత్రికలు ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. రహదారిపై ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎస్సై శ్రీనివాసరావు సొంత నిధులతో డ్రమ్ములను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పొదలకూరు-మనుబోలు మార్గంలోని చెర్లోపల్లి సమీపంలో రహదారిపై ప్రమాదకరమైన మలుపు ఉంది. ఎదురు వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – రామయ్య, స్థానికుడు.

సమాధానం: పరిశీలించి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. – శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఏఈ

? ఏఎస్‌పేటలోని తూర్పు వీధిలో కొంత మేర గ్రావెల్ రోడ్డు ఉంది. సిమెంటు రోడ్డు నిర్మించాలి. – పి.అస్లం, గ్రామస్థుడు

✔ తూర్పు వీధిలో సిమెంటు రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే రోడ్డు వేయడం జరుగుతుంది. – యస్‌దానిబాషా, పంచాయతీ కార్యదర్శి

? విడవలూరులోని ప్రధాన కూడలిలో ఎల్లు రేవుకు మార్గం వద్ద విద్యుత్తు దీపం వెలగడం లేదు. – శ్రీనివాసులు, విడవలూరు

✔ సమస్య పరిష్కరిస్తాం. – సురేష్ కుమార్, ఎంపీడీవో

వైకాపా పాలనలో సహజ వనరుల దోపిడీ

ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, మనుబోలు, వెంకటాచలం, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, సహజ వనరుల దోపిడీ తప్ప అభివృద్ధి చేయలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దుయ్యబట్టారు. ఆదివారం ముత్తుకూరులోని శ్మశాన అభివృద్ధి పనులు, చేపల మార్కెట్, ఆర్‌అండ్‌బి అతిథి గృహం, చెరువులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ముత్తుకూరు ఉన్నత పాఠశాల అభివృద్ధితో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం దొరువుల పాళెంలో పర్యటించారు. మండలంలోని దొరువుల పాళెంకు చెందిన మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైకాపా నాయకులు తెదేపాలో చేరారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని మాజీ మంత్రి కాకాణిని ఉద్దేశించి తోటపల్లిగూడూరు తెదేపా మండలాధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి హెచ్చరించారు. వరకవిపూడిలో ఆయన మాట్లాడారు. వైకాపా నాయకులు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెదేపా నాయకులు రమణయ్య, నాగరాజులు ఒక ప్రకటనలో తెలిపారు



ముత్తుకూరులో అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వైభవంగా జెండా మహోత్సవం

మనుబోలు: దసరా మహోత్సవాలు సందర్భంగా మండలంలోని పిడూరులో ఆంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణతో చేసిన ట్రాక్టర్‌లో హంస వాహనంపై అంజనీసుతుని ఉత్సవమూర్తిని కొలువుదీరి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆంజనేయస్వామి జెండా మహోత్సవంలో భాగంగా మంగళవాయిద్యాలు, కోలాటం, డీజే నృత్యాలతో యువత కేరింతల నడుమ స్వామివారి గ్రామోత్సవం వేడుకగా జరిగింది.



ఆంజనేయ స్వామి గ్రామోత్సవం

కండలేరు జలాశయంలో మత్స్యకారుడి గల్లంతు

రాపూరు,న్యూస్‌టుడే : మండలంలోని ఓబులాయపల్లికి చెందిన పి.చెంచయ్య అనే మత్స్యకారుడు ఆదివారం చేపల వేటకు వెళ్లి కండలేరు డ్యాంలో గల్లంతయ్యారని స్థానికులు తెలిపారు. ఉదయం చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటి రాకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. మత్స్యకారులు డ్యాంలో గాలిస్తున్నారు.

తీగజాతి మొక్కలు తొలగించారు

స్పందనకు వందనం

మర్రిపాడు, న్యూస్‌టుడే: ఖాదర్‌పూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. 4న 'ఎందుకింత నిర్లక్ష్యం..?' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ రామచంద్రయ్య స్పందించారు. లైన్‌మెన్ వెంకటేశ్‌ను పంపి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న మొక్కలను తొలగింపచేశారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేయరూ..

ఏఎస్‌పేటలో నీటి సమస్యలు తీర్చేందుకు చేతిపంపులు ఏర్పాటు చేశారు. నిర్వహణ గాలికొదిలేయడంతో మరమ్మతులకు గురయ్యాయి. స్థానిక ఆనకట్ట వీధిలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఒకటి, దర్గా రెండో గేటు ఎదురుగా మరోక చేతిపంపు మరమ్మతులకు గురయ్యాయి. ఇటీవల ఏఎస్‌పేటలోని రక్షిత నీటి పథకాల విద్యుత్తు తీగలు చోరీకి గురికావడంతో ఆ సమయంలో నీటికోసం ప్రజలు అవస్థలు పడ్డారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ కార్యాలయానికి వచ్చిందని ఆయా పంచాయతీల కార్యదర్శులు చొరవ చూపి మరమ్మతులు చేయించాల్సి ఉందన్నారు.

– న్యూస్‌టుడే, ఏ.ఎస్.పేట



బస్టాండ్ గోడకు పగుళ్లు..!

పొదలకూరు ఆర్టీసీ బస్సు స్టేషనులోకి కొన్ని రోజులుగా బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడంతో బస్సుస్టేషనుపైన మొక్కలు మొలుస్తున్నాయి. ఇలాగే వదిలేస్తే భవనం పగుళ్లిస్తుందని స్థానికులు చెబుతున్నారు. రాపూరు డిపో మేనేజరు అనిల్‌కుమార్ మాట్లాడుతూ బస్ స్టేషన్‌కు కేటాయించిన విలువైన స్థలాన్ని అద్దె ప్రతిపాదికన గుత్తేదారులకు అప్పగించామన్నారు. త్వరలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు



వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోరా..!

వెంకటాచలం మండల పరిధిలో కసుపూరు నుంచి కసుమూరుకు వెళ్లే ప్రధాన మార్గం వద్ద జ్యోతి నగర్ సమీపంలో రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. సమీపంలో నివసించే వారితో పాటు, రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తొలగించాలని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ.. చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం



కొమ్మకొమ్మకు విరగకాశాయి..!



కొమ్మకొమ్మకు విరగ్గాసిన మునగకాయ చెట్టు విడవలూరులోని వీరయ్య ఇంట్లోది. చెట్టు కొంచెమైన కాయలు మాత్రం కొమ్మలు కనిపించకుండా దండిగా కాశాయి. బరువుతో కొమ్మలు విరిగిపోతున్నాయని యజమాని కర్రలు కట్టి జాగ్రత్తగా కాపాడుతున్నారు. చెట్టుకాయలు చూసి పలువురు ఔరా అంటూ ఆసక్తిగా చూస్తున్నారు.

– న్యూస్‌టుడే, విడవలూరు, తోటపల్లిగూడూరు

వాహనదారులకు అవస్థలు

వెంకటాచలం నుంచి ముత్తుకూరుకు వెళ్లే మార్గంలో నిడిగుంటపాళెం సమీపంలో నక్కల కాలువ వంతెన వద్ద తొలగించిన తాటి చెట్లను రహదారిపై వేశారు. చెట్లతో పాటు, బయట ప్రాంతాల నుంచి చెత్తను కూడా తెచ్చి వేస్తున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో రోడ్డుపై వేసిన చెట్లు మొద్దులను ఢీకొని గాయపడ్డారు. ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ పంచాయతీ అధికారులకు చెప్పి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం



ఉపాధ్యాయుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సంఘం సభ్యులు

కోవూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వంద రోజుల పాలన పూర్తి చేయడంతో పాటు, గతంలో ఆయన సీఎం అయితే కావలి నుంచి తిరుమలకు పాదయాత్రకు వస్తామని ఏపీ ప్రైమరీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి కంచర్ల మధుసూదనరావు మొక్కుకున్నారు. అందులో భాగంగా శనివారం ఆయనతో పాటు మిత్రులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం కోవూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా కోవూరుకు చెందిన ఆ సంఘం సభ్యులు పాదయాత్రకు ఘనస్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

రాపూరు, న్యూస్‌టుడే: నవాబుపేట సమీపంలో మలుపు వద్ద పొదలకూరు నుంచి రాపూరు వస్తున్న ఆటో నవాబుపేట సమీపంలో ఆదివారం అదుపుతప్పి బోల్తా పడిందని ఎస్సై వెంకటరాజేశ్ అన్నారు. ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. గాయపడిన వారు 108 అంబులెన్స్ ద్వారా వైద్యం కోసం రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడి

కలువాయి, న్యూస్‌టుడే: మండలంలోని దాచూరు పంచాయతీ ముక్కుతిప్ప సమీపంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. అయిదు మంది కోడి పందేల రాయుళ్లను అదుపులోకి తీసుకొని, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సుమన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగజ్జననీ.. నమోస్తుతే



పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు



మనుబోలులో..



పొదలకూరులో..

పొదలకూరు, మనుబోలు, సైదాపురం, కలువాయి, రాపూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, విడవలూరు, ఆత్మకూరు, అనంతసాగరం, సంగం, చేజర్ల, న్యూస్‌టుడే: కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాలతో పాటు సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.. పొదలకూరులో శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సంతానలక్ష్మి, విజయలక్ష్మి అలంకారంలో లక్ష్మీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. మనుబోలు మండలం కోదండరామపురం దసరా చావిడి వద్ద రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. లలితాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరులో జరిగిన వివిధ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సైదాపురంలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో గౌరీదేవి అలంకారంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో శ్రీకలువాయమ్మ దర్శనమిచ్చారు. రాపూరు మండలం పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకారంలో, విడవలూరులో ధనలక్ష్మీ అలంకరణలో అంకమ్మతల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మకూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో పూజలు అందుకున్నారు. సంగంలో గంగమ్మ ఆలయంలో అమ్మవారికి నాణేలతో చేసిన అలంకారం భక్తులను ఆకట్టుకుంది. చేజర్ల, కోటితీర్థం, కాకివాయి, చిత్తలూరు, ఆదూరుపల్లి గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



విడవలూరులో..



కలువాయిలో..



ఆత్మకూరులో..



చేజర్లలో..



సంగంలో..

జాతీయ రహదారిపై లారీ బోల్తా



మనుబోలు: కంటైనర్ లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మనుబోలు అడ్డరోడ్డు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఆదివారం జరిగింది. వివరాల మేరకు... చెన్నై నుంచి ఔషధాల లోడుతో గుంటూరుకు వెళుతోంది. లారీడ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో జాతీయ రహదారి రెయిలింగ్ గార్డును ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

నగదు స్వాధీనం

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధి పవన్ కాలనీలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. జూదం ఆడుతున్న ఏడుగురు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.65 వేలు స్వాదీనం చేసుకున్నట్లు వెంకటాచలం సీఐ సుబ్బారావు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఆత్మకూరు: ఆత్మకూరు మండలం వాసిలి వద్ద ఇసుక ట్రాక్టరను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జిలానీ తెలిపారు. సంగం మండలం కోలగట్ల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బాకీ ఇవ్వలేదని పోలీసులకు ఫిర్యాదు

పొదలకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తాటిపర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రామంలో పలువురి నుంచి ఎక్కువ వడ్డీకి నగదు తీసుకున్నారని, తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని పిలిపించి విచారిస్తున్నారు. సుమారు 40 మంది వరకు తమకు నగదు ఇవ్వాలని లిఖిత పూర్వకంగా పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

రేషన్ దుకాణం ప్రారంభం

మనుబోలు, న్యూస్‌టుడే: స్థానిక కోదండరామపురంలో శనివారం నూతన రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. దుకాణం ద్వారా బీసీ కాలనీ, కోదండరామపురం, గిరిజనకాలనీ వాసులకు రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నామని డీలర్ శాంతి తెలిపారు. రేషన్ దుకాణాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శివుడు రాజాగౌడ్, వీఆర్‌ఏ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేరు ఘనం.. వసతులు మృగ్యం



చెట్టు కొమ్మలను తాకుతున్న విద్యుత్తు తీగలు

న్యూస్‌టుడే, విడవలూరు

గ్రామీణ ప్రాంతాల్లో కనీసవసతుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు... గత వైకాపా ప్రభుత్వంలో పల్లెసీమల అభివృద్ధికి వచ్చిన నిధులు మళ్లించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల్లో పలు సమస్యలతో గ్రామాల్లో ప్రజలు సతమతమవుతున్నా కనికరించలేదు. కూటమి ప్రభుత్వం రావడం, కొన్ని ప్రాంతాలకు నిధులు మంజూరవడంతో ప్రజల్లో అభివృద్ధి ఆశలు చిగురించాయి. ● కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలంలోని గాదెలదిన్నె గ్రామాన్ని గతంలో హడావుడిగా ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు. పురస్కారమిచ్చి మమ అనిపించారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా వదిలేశారు. గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పలువురు వాపోతున్నారు. గత పాలనలో సమస్యలు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పరిశీలించిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల గ్రామ సభలు నిర్వహించారు. ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు.

ప్రధాన సమస్యలివి.. : గ్రామంలో తాగునీటి చేతి పంపులు మరమ్మతులకు గురైతే ఇంత వరకు పట్టించుకోలేదు. విద్యుత్తు సరఫరా అంతరాయంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ● విద్యుత్తు తీగలు చెట్ల కొమ్మలను తాకుతున్నాయి. చిన్నపాటి గాలి వీచినా సరఫరా నిలిచిపోతోంది. ● మురుగు కాలువల్లో కొన్ని నెలలుగా పూడిక తీయక పోవడంతో దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. ● గ్రామంలో కొన్ని చోట్ల చేతిపంపు మూతలు తొలగించడంతో అవి ప్రమాదకరంగా ఉన్నాయి. పిల్లలు పైపుల్లో పడే ప్రమాదముందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ● వీధి దీపాలు కొన్ని చోట్ల వెలగడం లేదు. తాగునీటి పైపులకు చెక్ వాల్వు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. ● దీనిపై ఎంపీడీవో నగేశ్‌కుమారి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

సామాజిక భవన నిర్మాణానికి సహకరిస్తాం



చిన్నారులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి, అబ్దుల్ అజీజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ బధిరుల దినోత్సవం కార్యక్రమం తెదేపా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సీఎస్సార్ నిధులతోపాటు మిత్రుల సహకారంతో రూ.25లక్షలు సమకూరుస్తామని హామీనిచ్చారు. నెల్లూరు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పెంచలనాయుడు, హజరత్‌నాయుడు, బాబుచౌదరి, జాఫర్‌షరీఫ్, బాలకృష్ణచౌదరి పాల్గొన్నారు.

ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), న్యూస్‌టుడే: నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సిటీ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు.

వేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: ఏకేనగర్ ఎస్టీటీ కాలనీలోని 2, 3 వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – విజయకుమార్

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? రామ్మూర్తినగర్‌లో డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. – సావిత్రమ్మ

✓ డ్రైనేజీల్లో పూడికలు తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

విజయవాడ దుర్ఘటన మనకూ ఎదురైతే?

చినుకుపడితే నగరంలో ముంపే ● ఎటు చూసినా ఆక్రమణలే!



గచ్చు కాలువ కుంచించుకుపోయి ఇలా..

నెల్లూరులో పొరుదల కాలువలు ఆక్రమించుకున్న వారు ఖాళీ చేసి వెళ్లిపోవాలి. పేదలు, నిరుపేదలకు మాత్రమే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తాం. గత చేదు అనుభవాలు, భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా నెల్లూరులో ఇక ఆపరేషన్ బుడమేరు ప్రారంభిస్తున్నాం.

– రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలక సంస్థ)

విజయవాడ వరదలు సృష్టించిన విలయతాండవం చూస్తుంటే.. 9 లక్షలకుపైగా జనాభా ఉన్న నెల్లూరు నగరానికి అలాంటి ముప్పే పొంచి ఉందనే భయం నెలకొంది. వరద కాలువలు లేకపోవడం, పురాతన డ్రైనేజీ వ్యవస్థ తదితర కారణాలతో చిన్నపాటి వర్షాలకే నగరం జలమయమవుతోంది. గత అయిదేళ్లలో పాలకులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడమే కారణం.

2015 వరదల్లో విలవిల్లాడిన జనం

నెల్లూరు నగరం 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కాగా.. 54 డివిజన్లలో 1.56 లక్షల గృహాలున్నాయి. 2015లో వారం రోజులపాటు కురిసిన భారీ వర్షానికి జిల్లాతోపాటు నగరం అతలాకుతలమైంది. నగరం వారంపాటు వరద నీటిలో చిక్కుకుని జనం విలవిల్లాడారు. మన్సూర్‌నగర్, ఖుద్దూస్‌నగర్, మద్రాసు బస్టాండు, సుబేదారుపేట, పరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్ వరద నీటిలో చిక్కుకున్నాయి. పెన్నానది పరివాహక ప్రాంతం ఆక్రమణలతో 2021, 2023లోనూ నగరానికి ముంపు తప్పలేదు. 2015లో నగరం మునిగేందుకు ప్రధానంగా 14 పంట కాలువలు ఆక్రమణలేనని అధికారులు గుర్తించారు. కాలువలపై ఆక్రమణలను తొలగించేందుకు 23 బృందాలతో సర్వే చేపట్టారు. ఆక్రమణల్లో ఉన్న ఇళ్లు, దుకాణాలను ఫొటోలు తీశారు. పాత రికార్డులను దగ్గర పెట్టుకుని ఎంత మేర ఆక్రమణ గురయ్యాయో కొలతలు తీశారు.

60 నుంచి 10 అడుగులకు తగ్గిన కాలువలు

నగరంలోని 14 పంట కాలువలు 60 అడుగుల వెడల్పు ఉండాల్సి ఉండగా ఇరువైపులా పూర్తిగా ఆక్రమణలకు గురై 10 అడుగులకు చేరుకున్నాయి. నగరంలో స్థలం కొరతంటే ప్రాంతాన్ని బట్టి అంకణం రూ.లక్ష నుంచి రూ.2లక్షలు వరకు ధర పలుకుతోంది. ఇదే కొందరు భూబకాసురులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కొంతకాలం గడిచాక గుట్టుగా అమ్మకాలు సాగించేశారు. దీర్ఘకాలికంగా జరుగుతున్న ఈ భూదందాలో కొందరు నాయకులు, అధికారుల పాత్ర ఉందనే బహిరంగ రహస్యం. ఇదే పరిస్థితి కొనసాగితే నగరంలో ముంపు సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించడం జరుగుతుందని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు.



మన్సూర్‌నగర్‌లో ఆక్రమణలకు గురైన పంట కాలువ

బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా విద్యాపరంగా వెనుకబడిన గాండ్ల తెలికుల రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు డిమాండ్ చేశారు. అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నెల్లూరు మినీబైపాస్ రోడ్డు పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ గానుగలను ఏర్పాటు చేసుకునేందుకు రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయాలనీ, కనీసం 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించాలని కోరారు. గాండ్ల తెలికుల దేవ తిలకుల ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అధిక మొత్తం నిధులు మంజూరు చేయాలన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఒక ఎకరా, జిల్లా కేంద్రాల్లో కనీసం 1000 గజాల స్థలాన్ని, కమ్యూనిటీ భవన నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం, కోశాధికారి గార్లదిన్నె నాగరాజు, గౌరవ సలహాదారులు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు, అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నాయకులు పాల్గొన్నారు.

అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలి: కాకాణి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే వచ్చే ఎన్నికల్లో వైకాపా జెండా ఎగరడం ఖాయమని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవనంలో ఆదివారం నెల్లూరురూరల్ నియోజకవర్గ వైకాపా కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరురూరల్ నియోజకవర్గం వైకాపాకు కంచుకోట అని.. మళ్లీ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి కష్టమొచ్చినా పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న రెడ్ల ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: రెడ్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సాకర్ క్రీడాకారిణి పూజితారెడ్డికి రూ.25 నగదు ప్రోత్సాహాన్ని కొండా నిరంజన్ రెడ్డి అందించారు. రెడ్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్ చదువుతున్న చరణ్‌కుమార్‌రెడ్డి వెందోటి ధనుంజయరెడ్డి సహకారంతో రూ.3 లక్షలు, పర్వతరెడ్డి అభినయరెడ్డికి డాక్టర్ కృష్ణారెడ్డి సహకారంతో రూ.48 వేలు అందజేశారు. డాక్టర్ కృష్ణారెడ్డితోపాటు సదస్సు నిర్వహణకు సహకరించిన వారిని సత్కరించారు. ఐక్యవేదిక అధ్యక్షులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బి.వి.రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గుండాల ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

కరుణామయి.. కల్పవల్లి



విరాట్‌నగర్‌లో రాజరాజేశ్వరిగా..



వేదాయపాళెం శ్రీకృష్ణ మందిరంలో ధాన్యలక్ష్మిగా



మూలాపేట శివాలయంలో అన్నపూర్ణగా కొలువైన భువనేశ్వరి



గాజులమాలతో కళకళలాడుతున్న కాళీమాత



కొత్తూరు వెంకయ్యస్వామి ఆలయంలో దాక్షాయణిగా..

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల్లో అమ్మవారి దేవస్థానాలు భక్తులతో కళకళలాడాయి. దర్గామిట్టలోని రాజరాజేశ్వరి ఆదివారం వారం భక్తులకు అన్నపూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధానార్చకులు రఘురామమూర్తి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మవారిని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ సాయిప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణగా, దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని మీనాక్షి అలంకరణలో కొలువుదీరారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు భవాని అలంకరణలో భక్తుల పూజలందుకున్నారు. బాలాజీనగర్‌లోని సీతారామ మందిరంలో గజలక్ష్మిగా, విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా, నరసింహకొండపై కొలువైన ఆదిలక్ష్మి గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. వేదాయపాళెంలోని శ్రీకృష్ణ మందిరంలో అమ్మవారికి ధాన్యలక్ష్మి అలంకరణ నిర్వహించారు.

పట్టణానికి శరన్నవరాత్రి శోభ

నెల్లూరు(జడ్పీ): శరన్నవరాత్రి శోభతో పట్టణం కళకళలాడుతోంది. కొత్తూరు సమీపంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో దాక్షాయణిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆనందస్వామి ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. ఫత్తేఖాన్‌పేట మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సంతాన లక్ష్మీదేవిని అలంకరించారు. ఎర్రకట్ట సమీపంలో, మూలాపేట బ్రాహ్మణవీధిలో అన్నపూర్ణగా, కంచి కామాక్షిమాత ఆలయంలో శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. భువనేశ్వరి మాతను పల్లకీపై ఊరేగించారు. నీలకంఠేశ్వరస్వామి, రాజాగారి వీధిలోని గుడిలో, వేణుగోపాలస్వామి ఆలయ కూడలి, అలంకార్ కూడలిలో అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. మహాకాళిమాత అమ్మవారిని గాజులమాలతో అలకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తెరపై ఈనాడు

ఎం–1 సినిమాస్– స్క్రీన్1.. స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3..స్వాగ్, స్పైస్ సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. స్వాగ్, స్క్రీన్2..దక్షిణ, సత్యం సుందరం, స్క్రీన్3..కల్కి, జోకర్(ఇంగ్లిష్), స్క్రీన్4..స్క్రీన్5.. దేవర, **రెయిన్‌సినిమాస్**-స్క్రీన్1.. దేవర, స్క్రీన్2..స్వాగ్, దేవర, స్క్రీన్3..సత్యం సుందరం, జోకర్(ఇంగ్లిష్), స్క్రీన్4.. బహిర్భూమి, దక్షిణ, కల్కి, **సిరిమల్టీప్లెక్స్**..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. స్వాగ్, స్క్రీన్3..సత్యం సుందరం

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయం



రాష్ట్ర ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో ఎన్ఎఫ్‌డీబీ సభ్యులు, మత్స్యకార సమితి అధ్యక్షుడు పోలయ్య తదితరులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), న్యూస్‌టుడే: నగరంలోని వీఆర్సీ కళాశాల మైదానంలో జరుగుతున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ రెండో రోజు(ఆదివారం) జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల సముద్ర ఉత్పత్తులైన చేపలు, రొయ్యల వినియోగం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌డీబీ సభ్యులు, మత్స్యకార సమితి అధ్యక్షుడు కె.పోలయ్య పాల్గొన్నారు.

చెత్తతో దుర్గంధం

నగరంలోని బృందావనంలో చెత్త పేరుకుపోయింది. చినుకులు పడుతుండటంతో తడిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఆసుపత్రులు, వ్యాపార ప్రాంతం కావడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దుర్వాసన భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. చెత్తను తొలగిస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



ట్రంకురోడ్డులో మురుగునీరు



నిత్యం వాహనదారులు, ప్రయాణికులు, కొనుగోలు దారులతో రద్దీగా ఉండే ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్‌లో నిత్యం మురుగు నీరు పారుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇక్కడి మురుగుకాలువ పొంగి పొర్లుతోంది. గత రెండు రోజులుగా మురుగునీరు రోడ్డు మీదకు పారుతోంది. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

తెదేపాలో భారీగా చేరికలు

నెల్లూరుగ్రామీణం: 28వ డివిజన్‌కు చెందిన మోహన్‌రెడ్డి, 29వ డివిజన్ సూరి, 20వ డివిజన్ సురేశ్, సజ్జాపురానికి చెందిన పోలయ్య, శ్రీధర్, కొండ్లపూడికి చెందిన దినేష్‌రెడ్డి, ఉప్పుటూరుకు చెందిన శీనయ్య, గొల్లకందుకూరుకు చెందిన అశోక్, 2వ డివిజన్‌కు చెందిన వైకాపా నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి, మురళీరెడ్డి తెదేపాలో చేరారు. నగరంలోని మాగుంటలేఅవుట్ రూరల్ తెదేపా కార్యాలయంలో ఆదివారం వీరికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాదయాత్రకు సంఘీభావం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చంద్రబాబు సీఎం కావాలని వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో కావలి నుంచి పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. నగరంలోని తెదేపా కార్యాలయం వద్ద నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు ఆదివారం సంఘీభావం తెలిపారు. తెదేపా నాయకులు రమణారెడ్డి, పీఎల్‌రావు, ఎస్కే రసూల్ పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని స్టోన్‌హౌస్ పేట పప్పులవీధి సమీపంలో దేవాదాయశాఖకు చెందిన కర్మత్రాల సత్రాలను దాతలు ఆధునికీకరించారు. గతంలో సరైన వసతులు లేక ఇబ్బందికరంగా ఉన్న వీటికి ఏసీ వసతి కల్పించారు. దీంతో దాతలను ఆదివారం కమిటీ సభ్యులు సత్కరించారు. కొండా ప్రవీణ్, యాదాల నందకిశోర్, పాబోలు రామసుబ్బయ్య, ఈవో దర్గయ్య పాల్గొన్నారు.

మెరైన్ సిబ్బందికి లైఫ్‌జాకెట్ల పంపిణీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: మాల్లూరు శ్రీహర్ష ఛారిటబుల్ ట్రస్టు తరఫున ట్రస్టు ఛైర్మన్ మాల్లూరు రామశేషయ్య, కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో మైపాడు బీచ్‌లో మెరైన్ ఎస్ఐ అంజిరెడ్డి, ఇతర సిబ్బందికి లైఫ్‌జాకెట్లు, ఇతర పరికరాలు అందించారు. మైపాడు బీచ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వి.సుబ్రహ్మణ్యం మెరైన్ సిబ్బందికి లైఫ్‌జాకెట్లు అందజేశారు.



లైఫ్‌జాకెట్లను అందజేస్తున్న పీఎఫ్ అధికారి వి.సుబ్రహ్మణ్యం

వడ్డెరులను ఆదుకోవాలని వినతి



ఓబన్న చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ కోరారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న వర్ధంతిని నిర్వహించారు. సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య, ఓసీసీఐ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ బాలవెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మల్లి సింహగిరి, మల్లి నవీన్‌బాబు, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీరజినీ పాల్గొన్నారు.

పది శాతం దుకాణాలు కేటాయించాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ ప్రకారం కల్లుగీత కార్మికులకు 10% మద్యం దుకాణాలు కేటాయించాలని గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నం దయాకర్‌గౌడ్ కోరారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం ఐక్య వేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇతరులకు తమ గుర్తింపుకార్డులు, లైసెన్సులు ఇవ్వరాదన్నారు. బుర్ర వెంకటేశ్వర్లుగౌడ్, ముత్యం గౌడ్, భాస్కర్‌గౌడ్, నాగేశ్వరరావు, చక్రపాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌడ సంఘం ఐక్య వేదిక నాయకులు

మతి స్థిమితం లేని మహిళపై దాడి

నెల్లూరు(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఓ దుకాణం అరుగు మీద నిద్రపోతున్న మతి స్థిమితం లేని మహిళపై దాడి జరిగిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలోని ఆనం వెంకటరెడ్డి మున్సిపల్ క్వార్టర్స్ ప్రాంతంలో గత కొంతకాలంగా మతిస్థిమితం లేని మహిళ తిరుగుతోంది. పది రోజుల క్రితం అర్ధరాత్రి వర్షం పడుతుండగా ఓ యువకుడు ఆమెపై దాడికి పాల్పడ్డాడు. కుక్కలు అరవడంతో నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. అయితే, ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అవడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై పోలీసులు దర్యాప్తు నిర్వహించి సంబంధిత యువకుడిని స్టేషన్‌కు పిలిపించి తమదైన శైలిలో విచారించారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(నేర విభాగం): ఇంట్లో నుంచి వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలువాయిలో ఇబ్రహీం నివసిస్తున్నారు. ఆయన మానసిక పరిస్థితి సరిగాలేదు. ఆయన కుమారుడు ఇబ్రహీం హుస్సేన్ నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల ఇబ్రహీం కుమారుని వద్దకు వచ్చారు. రెండు రోజుల క్రితం ఆయన ఇంట్లో నుంచి అదృశ్యమయ్యారు. బాధిత కుటుంబం ఆయన కోసం గాలించారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 9440796306, 9666765228కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

సమన్వయ లోపం.. సేవలకు అంతరాయం

న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

శాఖల మధ్య సమన్వయలోపంతో అంతర్జాల సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర కార్పొరేషన్ పరిధిలో విస్తృతంగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతంలో డ్రెయిన్ల నిర్మాణాలు అధికంగా జరుగుతుండడం, మరోవైపు కిసాన్‌నగర్ ప్రాంతం నుంచి బుజబుజనెల్లూరు వరకు నగరానికి ఆనుకుని జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో రోడ్డు వెంబడి కల్వర్టులు, ఇతర పనుల నిమిత్తం పొక్లెయిన్‌లతో గుంతలు తీసే పనులు చేస్తున్నారు.

తెగిపోతున్న తీగలు

నగర పరిధిలో వినియోగదారులకు అంతర్జాల సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్, పలు ప్రైవేటు కంపెనీలకు చెందిన కేబుళ్లు భూమిలో వెళుతున్నాయి. ఇవి మూడు నుంచి అయిదు అడుగుల లోపల ఉన్నాయి. అభివృద్ధి పనులకు భూమిని తవ్వే సమయంలో ఆ ప్రాంతంలో ఏమైనా కేబుల్ వైర్లు వెళుతున్నాయా లేదా తెలుసుకోవాల్సి ఉంది. అలా జరగడం లేదు. డ్రెయిన్‌ల నిర్మాణ సమయంలో పొక్లెయిన్‌తో కాలువలు తవ్వేటపుడు కేబుల్ వైర్లు పలుచోట్ల తెగిపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. అయ్యప్పగుడి, బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్‌కు చెందిన అంతర్జాల సేవలు నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఇంటర్నెట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయం పలువురు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లగా అయ్యపగుడి పరిసర ప్రాంతాలలో పనుల వల్ల కేబుల్ వైర్లు తెగిపోయాయని మరమ్మతులు చేశామని చెప్పారు. పెద్దఎత్తున ఫోన్లు వస్తుండడంతో వారు సమాధానం చెప్పలేకపోయారు. ఇప్పటికైనా శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉంటాయి.



కాలువ పక్కన తెగిపోయిన కేబుల్